బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 13 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## లైంగికదాడి, హత్య చేసి హాయిగా నిద్ర పోయిన నిందితుడు...

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఘటన తర్వాత నిందితుడు ఇంటికి వెళ్లి, హాయిగా నిద్రపోయినట్లు తెలిసింది. విచారణ సమయంలో కూడా అతడు ఏమాత్రం పశ్చాత్తాప పడలేదని, తనకు ఉరి వేస్తే వేసుకోండని పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

నిందితుడు హత్య అనంతరం పడుకుని ఉదయం లేచి సాక్ష్యాలను చెరిపేసేందుకు దుస్తులపై ఉన్న రక్తపు మరకలను ఉతుక్కున్నాడు. అయితే అతడి బూట్లపై ఉన్న రక్తపు మరకల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. పౌర వాలంటీరైన నిందితుడికి ఆస్పత్రితో ఎలాంటి సంబంధం లేదని, అప్పుడప్పుడు అక్కడకు వెళ్తాడని తేలింది. కేసులో ఇతరుల ప్రమేయంపై ఆధారాలు లభించలేదు.

సంజయ్ రాయ్ దర్యాప్తు సమయంలో ఏమాత్రం పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా, ఉరి తీయాలనుకుంటే తీసుకోవాలని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అతడి ఫోన్ నిండా అశ్లీల వీడియోలు ఉన్నట్లు తెలిసింది. సంజయ్‌కు ఇప్పటికే 4 పెండ్లీలు జరిగినట్లు సమాచారం.

మిగితా 2వ పేజీలో

## వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో కొరియా పెట్టుబడులు

- బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిలుపునకు టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలత



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో ఈమేరకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు గ్లోబల్ కంపెనీల అధినేతలు, బిజినెస్ గ్రూపులతో సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. ఈక్రమంలోనే కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. టెక్స్‌టైల్ రంగం విస్తృత్తికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ స్థానిక కంపెనీలతోపాటు ప్రపంచ స్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉందని సీఎం తెలిపారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు.

యంగాన్ కార్పొరేషన్ చైర్మన్ కియాక్ సంగ్ , కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సొయంగ్ జూ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు ఈ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి గారి వెంట పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా సమావేశంలో ఉన్నారు.

## కబ్జా చేస్తే కఠిన చర్యలు

- చెరువులను ఆక్రమిస్తే చూస్తే ఉరుకోం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో స్థలాలు కొనొద్దు
- చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం
- మొదటి దశలో ఆక్రమణలను అడ్డుకోవడం
- రెండో దశలో ఆక్రమించిన చోట నిర్మాణాలపై చర్యలు
- మూడో దశలో పూడికతీత, పునరుజ్జీవం కల్పించటం
- మీడియాతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కట్టాలంటే భయపడే స్థితికి తీసుకొస్తామన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కుపైగా ఉన్నాయని చెప్పారు. నగరంలోని చెరువులను హైడ్రా ప్రధానంగా తీసుకుంటుందన్నారు. ఎన్ఆర్ఎస్సీ నివేదిక ప్రకారం 44 ఏండ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయని వెల్లడించారు. చాలా చెరువులు 60 శాతం, కొన్ని 80 శాతం ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు.ఆక్రమణలను గుర్తిస్తున్నాం.. చెరువుల పరిధిలోని ఆక్రమణలను గుర్తిస్తున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు.

చెరువుల ఆక్రమణలను అడ్డుకోకపోతే హైదరాబాద్ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందన్ని తెలిపారు. త్వరలో హైడ్రాకు ప్రభుత్వం పెద్దఎత్తున సిబ్బందిని సమకూరుస్తుందని, ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా ఉంటుందన్నారు. 2500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హైడ్రా పరిధి ఉందని తెలిపారు. ప్రజల నుంచి తమకు వందలాది ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. దురాక్రమణలపై దశలవారీగా చర్యలు..దశలవారీగా హైడ్రా పనిచేస్తుందన్నారు. మొదటి దశలో ఆక్రమణలను అడ్డుకోవడం హైడ్రా చేసే అని వివరించారు. రెండో దశలో ఆక్రమించి నిర్మించిన భవనాలపై చర్యలు, అనుమతుల నిరాకరణ ఉంటుందన్నారు.

మూడో దశలో చెరువుల పూడిక తీసి వాననీటిని మళ్లించి పునర్జీవనం కల్పిస్తామన్నారు. గొలుసుకట్టు చెరువులన్నింటిని పునరుద్ధరిస్తామని చెప్పారు. చెరువులకు నీటిని మళ్లించే నాలాలు పూడుకుపోయాయని తెలిపారు. అవకాశవాదం వల్ల గొలుకట్టు చెరువులన్నీ మాయమయ్యాయని వెల్లడించారు. చెరువుల పరిరక్షణకు అందరితో కలిసి మేథోమదనం చేస్తామన్నారు.

పార్కు స్థలాలు పరిరక్షించే కాలనీ సంఘాలను సమర్థిస్తామన్నారు. పార్కు స్థలాల్లో ఫెన్సింగ్ వేసేందుకు కాలనీ సంఘాలకు సహకరిస్తున్నామని తెలిపారు. బస్తీ వాసులు మెరుగైన జీవన ప్రమాణాలు పెరగాలన్నారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేయొద్దు..నందగిరి హిల్స్ సొసైటీతో తమకు ఎలాంటి ఒప్పందం లేదన్నారు. చందానగర్‌లో గతేడాది బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారని తెలిపారు.

మిగితా 2వ పేజీలో

## తెలంగాణలో హ్యుందాయ్ కొత్త మెగా టెస్టింగ్ సెంటర్

- ఇంజినీరింగ్ సెంటర్ విస్తరణకూ పెట్టుబడులు.. పెరగనున్న ఉద్యోగ అవకాశాలు
- పతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ప్రఖ్యాత హ్యుందాయ్ మోటార్స్‌సంస్థ తన సరికొత్త మెగా టెస్టింగ్ సెంటర్ ను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. భారీ ఎత్తున ఏర్పాటు కానున్న మెగా టెస్టింగ్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం (ఈవీలతో సహా) ఉంటుంది. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో ఈ మేరకు చర్చలు జరిపింది.

హ్యుందాయ్ మోటార్స్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణలో మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. అలాగే హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఆధునీకరించి, విస్తరించడానికి కూడా పెట్టుబడులు పెట్టనున్నట్లు హ్యుందాయ్ మోటార్స్ తెలిపింది.

తెలంగాణలో ఇప్పటికే ఉన్న ఇంజనీరింగ్ సెంటర్ విస్తరణతోపాటు కొత్తగా మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తమ వ్యాపార విస్తరణకు ఎంతో కీలకమని హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులు తెలిపారు. ఇలాంటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హ్యుందాయ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణం, ప్రభుత్వం విధానాలు తెలంగాణలో ఉన్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హ్యుందాయ్ మోటార్స్ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎంతోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. తెలంగాణలో హ్యుందాయ్ మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు ద్వారా అనుబంధ సంస్థలు కూడా రానున్నాయి. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

## మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులకు అస్వస్థత

వివరాలు 2వ పేజీలో

- సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలంలో ఘటన
- ఉడికీఉడకని గుడ్లు, నీళ్లచారు, కచ్చపక్కా అన్నం తినడం వల : విద్యార్థులు,
- 108 అంబులెన్స్‌లో ఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## 'హిండెన్‌బెర్గ్ ఆరోపణలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలి'

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్‌పై అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు సంచలనంగా మారాయి. దేశంలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. హిండెన్‌బెర్గ్ చేసిన ఆరోపణలపై దర్యాప్తును సీబీఐ లేదా సిట్‌కు అప్పగించాలని సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది.

మిగితా 2వ పేజీలో

## తిరుమలలో 3 రోజులు ఆ సేవలు రద్దు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఆగస్టు నెలలో తిరుమల వెళ్లే భక్తులకు ముఖ్యమైన గమనిక. ఈ నెలలో మూడు రోజుల పాటు పలు సేవల్ని రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు తిరుమల ఆలయంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఆగస్టు 14న అంకురార్పణంతో ఈ పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా శ్రీవారి

మిగితా 2వ పేజీలో

## 8 నెలల పాలనలో ఎందుకింత వ్యవసాయ విధ్వంసం

- రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గటంపై కేటీఆర్ ఆందోళన
- తగ్గిన సాగు తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతం
- ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలతోనే ఈ దయనీయ స్థితి
- ము్ఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం సచివాలయం గేటు దాటటం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఈ ఏడాది దాదాపు 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గటంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా సోమవారం పోస్ట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలోనే వ్యవసాయానికి ఎందుకింత గడ్డుకాలమని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో పాలన సాగుకు స్వర్ణయుగమైతే...కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సాగు విస్తీర్ణం ఒక్కసారిగా ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గటం ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలోనే దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో...ఎనిమిది నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందో చెప్పాలన్నారు.

ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్న చేతలు మాత్రం సచివాలయం గేటు దాటటం లేదని మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీళ్లు మళ్లించే తెలివి లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో.రైతు బతుకుకు భరోసానే లేదు' అని కేటీఆర్ అన్నారు. నిన్న వ్యవసాయానికి కరెంట్ కట్ చేశారు. నేడు రుణమాఫీలో రైతుల సంఖ్య కట్ చేశారు. సాగయ్యే భూమి విస్తీర్ణాన్ని కూడా కట్ చేసే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ ఏర్పడిందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు రూ.500 బోనస్ అని.. నిలువునా మోసం చేసింది ఈ కాంగ్రెస్ సర్కార్ అని మండిపడ్డారు.

ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు.. అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారటం ఆందోళన కలిగిస్తోందన్నారు. బురద రాజకీయాలు తప్ప.. సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి ఈ ముఖ్యమంత్రికి అసలే లేదన్నారు. ఎరువులు-విత్తనాల కోసం రైతులకు తిప్పలు, క్యూలైన్ లో పాసుబుక్కులు, చెప్పులు పెట్టే ఆ నాటి పరిస్థితి మళ్లీ తెచ్చారన్నారు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్దే.. పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులు, అప్పుల బాధతో.. అన్నదాతల ఆత్మహత్యలు చేసుకుంటారని చెప్పారు. కౌలు రైతుల బలవన్మరణాలు కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విజన్ లేక రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోలేని చేతగాని తనం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 30 వేల ఉద్యోగాల కథ లాగే..

## సీతారామ ప్రాజెక్టు కథ కూడా ఉంది

- ప్రాజెక్టు 90 శాతం బీఆర్ఎస్ పూర్తి చేసింది
- కేసీఆర్ లేకుండా ఉంటే అంత గొప్పగా సీతా రామ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగేదా..?
- సీతారామ కేసీఆర్ కల.. ఇది ఆయన కృషి ఫలితం
- మంత్రి తుమ్మల మాట మార్చారు
- మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

30 వేల ఉద్యోగాల కథ ఎట్ల ఉన్నదో.. సీతారామ ప్రాజెక్టు కథ కూడా అట్లనే ఉందని మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పూర్తయింది.. కానీ తామే ఈ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు కాంగ్రెస్ నేతలు కటింగ్ ఇస్తున్నారంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ క్రెడిట్ కాదని గుండెల మీద చేయి వేసుకోని చెప్పమనండి అని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు హరీశ్‌రావు సవాల్ విసిరారు. సీతారామ ప్రాజెక్టు నా జీవిత కల.. దాన్ని కేసీఆర్ సాకారం చేశారని గతంలో ఇదే తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ నాయకులు.. కేసీఆర్ సాధించిన విజయాలను మీవిగా చెప్పుకోవడానికి తాపత్రయం పడుతున్నారంటేనే అది మా నైతిక విజయానికి సూచిక. మీ తండ్లాట చూస్తుంటే మేం నైతికంగా గెలిచినట్లే. ఈ ఎనిమిది నెలల కాలంలో ఒక్క మంచి పని కూడా చేయలేదు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం మేం కృషి చేస్తుంటే ఇదే కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేశారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన సందర్భంగా తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు తన జీవిత కల, ఆకాంక్ష అని చెప్పారు. ఈ రోజు మాత్రం అదే తుమ్మల నాగేశ్వర్ రావు మాట మార్చారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం బీఆర్ఎస్ పార్టీ ఘనత కాదని తుమ్మలను గుండెల మీద చేయి వేసుకోని చెప్పమనండి. కేసీఆర్ లేకుండా ఉంటే అంత గొప్పగా సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగేదా..? సీతారామ కేసీఆర్ కల.. ఇది ఆయన కృషి ఫలితం. చాలా దూరదృష్టితో కేసీఆర్ ఆలోచించారు అని హరీశ్‌రావు తెలిపారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్‌లో కూడా కొన్ని మండలాలు, నియోజకవర్గాలు వదిలిపెట్టేసింది. ప్రతి ఏడాది కృష్ణాలో ఆలస్యంగా నీరు రావడంతో ఒక పంట మాత్రమే వేసేవారు. గోదావరిని ఒడిసి పట్టుకుని ఖమ్మం జిల్లా ప్రవహిస్తోంది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి కానీ ఖమ్మం జిల్లాకు గోదావరి నీళ్లు రాలేదు. ఖమ్మం జిల్లాను రెండు పంటలు పండే జిల్లాగా మార్చాలని సీతారామ ఎత్తిపోతలకు కేసీఆర్ రూపకల్పన చేశారు. రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్‌లో నీటి సామర్థ్యం 3 వేల క్యూసెక్కులు. కానీ సీతారామ ప్రాజెక్టుకు 9 వేల క్యూసెక్కులు తెచ్చే విధంగా కేసీఆర్ ఆలోచించారు. ఓట్ల కోసం ప్రాజెక్టులు నిర్మించరు. భవిష్యత్ అవసరాల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తారు. కృష్ణాలో నీళ్లు రాకపోయినా.. గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టును సప్లిమెంట్ చేయాలని కేసీఆర్ అనుకున్నారు. ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే విధంగా సీతారామ ప్రాజెక్టుకు కేసీఆర్ రూపకల్పన చేశారు అని హరీశ్‌రావు తెలిపారు.

సీతారామ ప్రాజెక్టు తామే పూర్తి చేశామని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారని.... సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్‌లో 8 ప్యాకేజీలు ఉన్నాయి. 5 ప్యాకేజీలు కంప్లీట్ పూర్తయ్యాయి. మిగతా 3 ప్యాకేజీల్లో 80 శాతం పని పూర్తయింది. ఓవరాల్‌గా బీఆర్ఎస్ హయాంలో 90 శాతం ప్రాజెక్టు పూర్తయింది. పంపులు, మోటార్లు కూడా అప్పుడే పెట్టాం. సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరిగింది. ఇది అందరికీ తెలుసు. ఇక అక్కడికి వెళ్లి నీళ్లు చల్లుకుంటే తమ పాపాలు పోతాయని వారు అనుకుంటున్నారు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు ప్రజలను నమ్మించడం పొరపాటు. ఎందుకంటే అది సీతారామ ప్రాజెక్టు.. శ్రీరామచంద్రుల సత్యవాక్కు పరిపాలనకు, సత్యానికి, ధర్మానికి ప్రతిరూపం.. ఆయన పేరు మీద కట్టిన ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు చేస్తే ఆ భగవంతుడు కూడా మిమ్మల్ని క్షమించడు. మీ పరిపాలనలో నిర్మించినప్పుడు మీ ఘనతగా చెప్పుకుంటే మాకు అభ్యంతరం లేదు. ఇతరుల ఘనతను తమ ఘనతగా చెప్పుకునే దరిద్రం నుంచి బయటకు రావాలని హరీశ్‌రావు సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం సన్నాహక సమావేశాల పేరు మీద నెత్తిమీద నీళ్లు చల్లుకుంటూ పోటీలు పడుతున్నారు. ఒక మంత్రి మొదటి పంపు హౌజ్ బటన్ నొక్కి నీళ్లు నెత్తిమీద చల్లుకొని భూమికి దండం పెట్టిండు. వెంటనే ఇంకో మంత్రి వెళ్లి తన కంటే ముందు క్రెడిట్ కొట్టేయాలని ట్రాక్టర్ నడుపుతూ వెళ్లి ఇది నేనే చేస్తున్నట్టు నటించారు. నేను కదా

మిగితా 2వ పేజీలో

# ‘హిండెన్‌బెర్గ్ ఆరోపణలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలి’



(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు, హస్తం పార్టీతోపాటు దాని మిత్రపక్షాలు దేశంలో ఆర్థిక అస్థిరతకు దారితీసేందుకు కుట్ర పన్నాయని బీజేపీ ఆరోపించింది.

సెబీతో కుమ్మక్కు అయ్యే అవకాశం ఉన్నందున అదానీ సంస్థను ఉద్దేశించి హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై దర్యాప్తును సీబీఐ లేదా సిట్‌కు అప్పగించాలని సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. సెబీ ఛైర్‌పర్సన్ పదవికి మాదభి బచ్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. మోదీ, అదానీ కలిసి చేసిన “మోదానీ మెగా స్కామ్”పై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడానికి వెంటనే జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని పునరుద్ఘాటించారు.

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై 2 నెలల్లో దర్యాప్తు ముగించాలని గతేడాది ఫిబ్రవరిలో సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు జైరాం రమేశ్. ఇప్పటివరకు కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌కు సంబంధించిన రూల్ 19ఏని అదానీ సంస్థ ఉల్లంఘించిందా అనే దాన్ని కూడా సెబీ తెలుసుకోలేదని ఆరోపించారు. సెబీ దర్యాప్తు ఆలస్యం వల్ల తన స్నేహితుడి అక్రమ కార్యకలాపాలు బయటపడకుండా ప్రధాని మోడీ, ఎన్నికలను సౌకర్యవంతంగా నావిగేట్ చేశారన్నారు.

“మాధవి బచ్‌ను సెబీ ఛైర్‌పర్సన్‌గా నియమించే సమయంలో బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది? అదానీ ఆఫ్‌షోర్ కంపెనీల్లో ఆమెకు పెట్టుబడులు ఉన్నాయని నిజంగానే వారికి తెలియదా? లేక తెలిసే చేశారా? దానికి కూడా కాంగ్రెసే కారణమా? అని హస్తం పార్టీ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు. “ఈ మొత్తం వ్యవహారానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వమేకారణం. సెబీ ఛైర్మన్ నియామకం సమయంలో ఈ విషయాల్ని పరిగణనలోకి తీసుకోలేదు. అందుకే అదానీకి సెబీ ఓ కాజీ క్లబ్‌లా మారిపోయింది” అని పవన్ ఆరోపించారు.

అయితే సెబీ ఛైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై జేపీసీ విచారణ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచి, దేశంలో పెట్టుబడులను నాశనం చేసే బూటకం లాంటిదని వ్యాఖ్యానించింది. ప్రతిపక్షాల విమర్శలు కుట్రలో భాగంలోనివని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు.

ప్రజలు తిరస్కరించిన తర్వాత కాంగ్రెస్‌తోపాటు దాని మిత్రపక్షాలు టూల్‌కిట్ ముఠాలోని సన్నిహిత మిత్రుడితో కలిసి దేశంలో ఆర్థిక అస్థిరతకు దారితీసేందుకు కుట్ర పన్నాయని రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. 2004 నుంచి 2014 మధ్య పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు వచ్చిన నివేదికలు అప్పుడు ఎందుకు బయటకు రాలేదని ప్రశ్నించారు. కల్పిత నివేదిక ఆధారంగా ఆర్థికంగా అరాచకం సృష్టించడంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిమగ్నమైందని ఆరోపణలు చేశారు. అయితే పెట్టుబడిదారులు కాంగ్రెస్ కుట్రను గ్రహించారని, మార్కెట్‌ను కుదిపేసే ప్రయత్నాలను తిరస్కరించారని తెలిపారు. అదానీ గ్రూప్‌పై స్టాక్ మార్కెట్ అవకతవకలకు సంబంధించి గత ఏడాది హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసు పంపిందని, కానీ విచారణకు సహకరించలేదని ఆరోపించారు. దానికి బదులు ఇప్పుడు ఛైర్‌పర్సన్ మాధబిపై దాడి మొదలుపెట్టిందని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు ఆయన టూల్ కిట్ స్నేహితులు దేశంపై ద్వేషం పెంచుకున్నారని ఆరోపణలు చేశారు.

హిండెన్‌బర్గ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేశ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “ఇది దేశం పరువు తీసే గ్యాంగ్. రాహుల్ గాంధీ, జైరాం రమేశ్, హిండెన్‌బర్గ్ మన పరువు తీశారు. దేశానికి జరిగిన ఈ అవమానాన్ని మేం సహించం. ఇలాంటి వ్యక్తులు దేశానికి శత్రువులు. హిండెన్‌బర్గ్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం” అని చెప్పారు.

గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలోని కొన్ని బెర్ముడా, మారిషస్ ఫండ్‌లలో సెబీ చీఫ్ మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్ 2015లో పెట్టుబడులు పెట్టారని, వారి వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. 2017లో సెబీ పూర్తి కాలపు సభ్యురాలిగా మాధబి నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ ఛైర్‌పర్సన్‌గా పదోన్నతి పొందారు. తమకు వాటాలున్న విదేశీ సంస్థలు కనుకే, అదానీ గ్రూప్‌పై సెబీ విచారణ తూతూ మంత్రంగా జరిగేలా చేశారన్నది హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణ. దీన్ని సెబీ చీఫ్‌తో పాటు అదానీ గ్రూప్ కూడా ఖండించింది..



## మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులకు అస్వస్థత

- సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలంలో ఘటన
- ఉడికీఉడకని గుడ్లు, నీళ్లచారు, కచ్చపక్కా అన్నం తినడం వల : విద్యార్థులు,
- 108 అంబులెన్స్‌లో ఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉడికీఉడకని గుడ్లు, నీళ్లచారు, కచ్చపక్కా అన్నం తినడం వల్లే ఈ సంఘటన జరిగిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేధన వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థులను 108 అంబులెన్స్‌లో ఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 114 మంది విద్యనభ్యసిస్తున్నారు. కాగా సోమవారం 92 మంది విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం భోజనం తిని 24 మంది అస్వస్థతకు గురయ్యారు. బీబీపేట జడ్‌పిహెచ్ఎ స్‌లో సోమవారం మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నర్సింగ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, ఉడికీ ఉడకని గుడ్లు తినడం వల్లనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు జిల్లా అధికారులు నిర్ధారించారు.



దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరం నడిబొడ్డున ప్రవహించే చుంగ్‌గేచుంగ్ నదీ పరిసరాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఇతర ప్రతినిధి బృందం పరిశీలించారు. హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఉన్న ముఖ్యమంత్రి సియోల్ లోని #Cheonggyecheon నదిని ప్రపంచస్థాయి వాటర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్దిన తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ నది సుందరీకరణ జరిగిన తీరుతెన్నులను గమనించిన తర్వాత మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ పై అనేక ఆలోచనలకు అవకాశం ఇచ్చిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.
దాదాపు 11 కిలోమీటర్ల ఈ నది విపరీతమైన కలుషితాలతో ఉండేది. ఈ నదిని 2005 నాటి నుంచి పునరుద్ధరణ పనులతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్దిన తర్వాత సియోల్ నగరవాసులే కాకుడా ప్రపంచం నలుమూలల నుంచి ఏటా దాదాపు 19 కోట్ల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారు.

### లైంగికదాడి, హత్య చేసి

# హాయిగా నిద్ర పోయిన నిందితుడు...



(మొదటి పేజీ తరువాయి)

ఘటనకు కొన్ని గంటల ముందు వైద్యవిద్యార్థిని స్నేహితులతో కలిసి ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌ను వీక్షించినట్లు తెలిసింది. సహచరులతో కలిసి డిన్నర్ చేశాక తల్లికి ఫోన్ చేసి మాట్లాడినట్లు స్నేహితులు చెప్పారు. అనంతరం సెమినార్ హాల్‌లో చదువుకునేందుకు వెళ్లిందన్నారు.

మరోవైపు, ఘటన వివరాలు తెలుసుకునేందుకు కోల్‌కతా చేరుకున్న ఇద్దరు జాతీయ మహిళా కమిషన్ సభ్యుల బృందం పోలీసులతో చర్చించింది. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించింది.

కోల్‌కతా ఆర్‌జీ కర్ వైద్యకళాశాలలో పీజీ సెకండ్ ఇయర్ చదువుతున్న వైద్యవిద్యార్థిని గురువారం రాత్రి విధుల్లో ఉండగా ఓ పౌర వాలంటీర్ సంజయ్ ఆమెను లైంగికదాడి చేసి హత్య చేశాడు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో ఆమె శవమై కనిపించారు. మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి తీవ్ర రక్త స్రావం జరిగినట్లు ప్రాథమిక శవ పరీక్షలో తేలింది. శరీరంపై వివిధ చోట్ల గాయాలు కనిపించాయి.



## తిరుమలలో 3 రోజులు ఆ సేవలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్ల గానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపమూ రాకుండా.. ఆగమశాస్త్రం ప్రకారం ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తిరుమలలో పవిత్రోత్సవాలు 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలు ఉన్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 15న పవిత్రాల ప్రతిష్ఠ, ఆగస్టు 16న పవిత్ర సమర్పణ, ఆగస్టు 17న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ పవిత్రోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 14న అంకురార్పణ కారణంగా.. సహస్రదీపాలంకరణ సేవను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. అదే విధంగా.. ఆగస్టు 15న తిరుప్పావడతోపాటు ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలు రద్దు చేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి స్వామి వారి దర్శనానికి రావాలని టీటీడీ సూచించింది.

### 30 వేల ఉద్యోగాల కథ లాగే..

# సీతారామ ప్రాజెక్టు కథ కూడా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

నీటి పారుదల మంత్రిని అని చెప్పి.. ఆయన కూడా నిన్న వెళ్లి కట్కా ఒత్తి ఇది నా సొంతమని చెప్పకనే చెప్పారు. ఈ ముగ్గురు మంత్రులు క్రెడిట్‌కు పోయారు. ఇక 15న ముఖ్యమంత్రి వెళ్తారట అని హరీశ్‌రావు విమర్శించారు.

రాష్ట్రంలో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని.. కేసీఆర్ తన ఇష్టమైన ప్రాజెక్టుగా రూపొందించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుపై క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అపసోపాలు పడుతుంది. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన కృషి, సాధించిన గొప్ప విజయాలను తమ విజయాలుగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఫీట్లు పడుతుంది. ఖమ్మం జిల్లా కరువు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ సంకల్పించారు. పవిత్రమైన ఈ ప్రాజెక్టుకు సాక్షాత్తు సీతారామ చంద్రుల పేరే ఉండాలని వారి పేరు నామకరణం చేసి శరవేగంగా పూర్తి చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో అనేక కేసులు వేసి అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటూ వేగంగా నిర్మించే ప్రయత్నం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రభుత్వం మారడంతో ఆ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం కాంగ్రెస్ సర్కార్‌కు దక్కింది. రిబ్బన్ కంటింగ్ అవకాశం వచ్చిందని చెప్పి ప్రాజెక్టే తాము కట్టినట్టు కటింగ్ ఇస్తే ప్రజలు నవ్వుకుంటారు. ఇతరుల ఘనత తమ ఘనతగా చెప్పుకునే వారిని పరన్నాజీవులు అంటారు. ఇవాళ కాంగ్రెసోళ్లను చూస్తుంటే పక్కా పరాన్నజీవులు అనిపిస్తుంది. ఒక ప్రాజెక్టు కట్టాలంటే సర్వే, డీపీఆర్, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, నిధులు సమకూర్చాలి.. ఇలా ఎన్నో దశలు పూర్తి కావాలి. ఇవన్నీ పూర్తి కావాలంటే కనీసం కొన్ని సంవత్సరాలు పడుతుంది. మరి ఏడెనిమిది నెలల్లోనే ఇన్ని దశలు దాటి మీరు కట్టేశారా..? డీపీఆర్, సర్వేలు, టెండర్లు, భూసేకరణ, పంపులు, మోటార్లు బిగించి ప్రారంభిస్తున్నారా..? మిమ్మల్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఫిజికల్, మెడికల్ టెస్టులు చేసి ఫలితాలు విడుదల చేశాం. ఎన్నికల కోడ్, కోర్టు కేసులు, సాంకేతిక కారణాల వల్ల అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆగిపోయాయి. కానీ ఇవాళ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఇస్తే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. అయితే సీతారామ ప్రాజెక్టు 90 శాతం బీఆర్ఎస్ చేసిందని నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్ మంత్రులకు లేదు. కానీ ఆ ధైర్యం కేసీఆర్‌కు ఉండే. నిండు శాసనసభలో సీఎం హోదాలో కేసీఆర్ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్‌లు.. రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన వీటన్నింటిని యథావిధిగా కొనసాగిస్తామని ధైర్యంగా చెప్పిండు. సంస్కారం ఉన్న నాయకుడు కాబట్టి కేసీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ మీ సంస్కారం ఏంటి.. పాఠ్య పుస్తకాల్లో కేసీఆర్ పేరు, ఫొటో ఉన్నదని చెప్పి పేపర్లు చింపి తమ పేర్లను అతికించుకున్న చరిత్ర రేవంత్ రెడ్డిది. తమ హయాంలో పూర్తి చేసిన ఫ్లై ఓవర్లను, ప్రాజెక్టులను మాత్రమే ప్రారంభిస్తున్నారు. తమ హయాంలో ఆర్డర్లు ఇచ్చిన బస్సులకు జెండాలు ఊపుతున్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ నేతలు కాలం గడుపుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గూగుల్ సర్వీసుల్లో అంతరాయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పపంచవ్యాప్తంగా పలు దేశాల్లో సోమవారం గూగుల్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. జీమెయిల్, సెర్చ్, గూగుల్ డ్రైవ్, యూట్యూబ్ ఇతర సర్వీసులు నిలిచిపోయాయంటూ గూగుల్ యూజర్లు ఫిర్యాదులు చేశారు. అమెరికాలో ఉదయం 9 గంటలకు గూగుల్ సర్వీసులు ప్రభావితమైనట్టు తెలుస్తున్నది. సర్వీసులు నిలిచిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్ సిటీలో సర్వీసుల అంతరాయం ఎక్కువగా జరిగినట్టు డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ మ్యాప్ పేర్కొన్నది. ఈ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో వచ్చే అంతరాయాలను పర్యవేక్షి స్తుంటుంది. గూగుల్ సేవల అంతరాయానికి సంబంధించి అమెరికా, యూకే, ఐరోపా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలకు చెందిన యూజర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెట్టారు. కొంత సేపటికే సర్వీసులు యథాతథంగా పనిచేస్తున్నాయని కొంత మంది పేర్కొన్నారు. కాగా, ఈ అంతరాయానికి సంబంధించి గూగుల్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల క్రౌడ్ స్ట్రైక్ కారణంగా విండోస్‌లో తీవ్ర సమస్య తలెత్తిన నేపథ్యంలో తాజాగా గూగుల్ సమస్య ఎదురుకావడం గమనార్హం.

## సుంకిశాల ప్రమాదంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

- రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సుంకిశాల ప్రాజెక్ట్ కు లో ప్రహరీ గోడ కూలిన ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రమాదం జరిగి 10 రోజులు గడిచినప్పటికీ ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రమాదానికి కాంట్రాక్ట్ సంస్థ కారణమైతే ఆ సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టి ప్రమాదంపై జ్యుడీషి యల్ ఎంక్వైరీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేటీఆర్ కోరారు. కానీ ప్రభుత్వం ఈ విషయంలో బీఆర్ఎస్ పైనే ఆరోపణలు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో ఇక కేటీఆర్ డైరెక్ట్ గా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ అంశంపై ప్రశ్నించారు. ప్రమాదం జరిగి 10 రోజులైన కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు? తెలంగాణలో ఉన్న మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏజన్సీ పట్ల ఎందుకు అంతా మెతక వైఖరితో వ్యవహరిస్తోందో చెప్పాలని రాహుల్ గాంధీని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నిందితుడిని వదలొద్దు

- బెంగాల్ ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో 31 ఏండ్ల ట్రైనీ డాక్టర్ ను రేప్ చేసి హత్య చేసిన సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కేటీఆర్ అన్నారు. హాస్పిటల్ లో కూడా డాక్టర్లు సురక్షితంగా ఉండకపోతే మన ఆడపిల్లలు ఇంకెక్కడ క్షేమంగా ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇంత క్రూరమైన ఘటనకు పాల్పడిన వారిని వదిలిపెట్టకూడదని కేటీఆర్ అన్నారు. బెంగాల్ లోని మమతా సర్కార్ .. నేరస్తున్ని పట్టుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తుందని నమ్ముతున్నట్లు కేటీఆర్ తెలిపారు. నిరసన తెలుపుతున్న డాక్టర్లకు కేటీఆర్ సంఘీభావం తెలిపారు.

## గాజాలో యుద్ధం ఆపాలి ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ నేతల పిలుపు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గాజాలో ఇజ్రాయెల్‌హమాస్ మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఆపాలని, హమాస్ బందీలో ఉన్న వారిని విడుదల చేయాలని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల నేతలు సోమవారం పిలుపునిచ్చారు. మానవతా సాయం ఎలాంటి ఆటంకాలు లేకుండా బాధితులకు అందేలా చొరవ తీసుకోవాలని కూడా కోరారు. ఈమేరకు సంయుక్త ప్రకటన సోమవారం విడుదల చేశారు. తాజాగా అమెరికా, కతార్, ఈజిప్టు దేశాలు 10 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్ హమాస్ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం నిర్వహించడానికి తీసుకుంటున్న చొరవకు ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల నేతలు మద్దతు పలికారు.మధ్యవర్తులు కొన్ని నెలల పాటు దీనికోసం ప్రయత్నిస్తున్నారు. మూడు దశల ప్రణాళికను అంగీకరింప చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రణాళిక ప్రకారం హమాస్ అక్టోబర్ 7న తాను బందీ చేసిన వారిలో మిగిలిన వారిని తక్షణం విడిచిపెట్టాల్సి ఉంటుంది. అలాగే తాను బందీ చేసిన పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడిచిపెట్టాలి. గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ఫ్రెంచి అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ , జర్మనీ ఛాన్సెలర్



స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రతిష్టాత్మక మూవీ 'కంగువ'. ఈ చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కంగువ సినిమాను స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 10న దసరా పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో 'కంగువ' ట్రైలర్ ఆకట్టుకుంది. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్ గా బాబీ డియోల్ కనిపించారు. ష సినిమాను నైజాం ఏరియాలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నారు.

# ఐఐటి మద్రాసు నెంబర్ వన్..




- వరుసగా ఆరోసారి ఉత్తమ విద్యాసంస్థ
- ఇంజనీరింగ్ ర్యాంకుల్లో 3వ స్థానంలో హైదరాబాద్ ఐఐటి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అత్యున్నత ప్రమాణాల విద్యాసంస్థల జాబితాలో మద్రాసు ఐఐటి అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ సోమవారం ఈ టాప్ ర్యాంకుల వివరాలను ప్రకటించింది. ఈ క్రమంలో టాప్ నెంబరు వన్ స్థానంలో మద్రాసు ఐఐటి నిలవడం, ఇది ఈ క్రమంలో వరుసగా తొమ్మిదోసారి కావడం కీలక పరిణామం. కాగా బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ సైన్సెస్(ఐఐఎస్‌సి) వరసగా తొమ్మిదోసారి ఉత్తమ విద్యాసంస్థగా రాణించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యా ప్రమాణాలను విశ్లేషించే నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2024 పరిధిలో ర్యాంకులను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం ప్రకటించారు. ర్యాంకుల గణన ప్రకటన ఇది తొమ్మిదో పర్యాయం అయింది. మొత్తం మీద సమర్థత క్రమం జాబితాలో బెంగళూరు ఐఐఎస్‌సి రెండవ స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో ఐఐటి బొంబాయి, నాలుగో స్థానంలో ఐఐటి ఢిల్లీ తమ ప్రతిభను చాటుకున్నాయి. గత ఏడాది ఢిల్లీ ఐఐటి మూడోస్థానంలో నిలవగా ఈసారి ఒక్క స్థానం దిగజారింది. కాగా టాప్ టెన్ జాబితాలో ఎనిమిది ఐఐటిలు స్థానం సంపాదించుకున్నాయి. వీటిలో ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్య విజ్ఞాన పరిశోధనా సంస్థ కూడా ఉంది. ఢిల్లీ జెఎన్‌యూ కూడా టాప్ టెన్‌లో ఒక్కటి అయింది.

యూనివర్శిటీల విషయానికి వస్తే ఐఐఎస్‌సి బెంగళూరు తరువాత జెఎన్‌యూ తరువాతి క్రమంలో జెఎన్‌యు, జామియా మిలియా ఇస్లామియాలు ర్యాంకులు నిలబెట్టుకున్నాయి. ఐఐటిలలో తొమ్మిది వరకూ టాప్ టెన్ లిస్టులో నిలవడం ఇందులో మద్రాసు ఐఐటి నెంబర్ వన్ కావడం కీలకం. ఇక మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యాసంస్థల విషయానికి వస్తే అహ్మదాబాద్ ఐఐఎం నెంబర్ వన్ అయింది. తరువాతి స్థానంలో ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్‌లు నిలిచాయి. మేనేజ్‌మెంట్ కోర్సుల జాబితాలో కూడా బొంబాయి, ఢిల్లీ ఐఐటిలు మొదటి పది ర్యాంకుల స్థానంలో నిలిచాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటి హైదరాబాద్ 9వ స్థానంలో ఉంది.

ఫార్మసీ విద్య సంబంధిత విద్యాసంస్థల్లో జామిమా హమ్‌దర్ద్ అగ్రస్థానంలో నిలవగా, రెండో స్థానంలో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇనిస్టూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్ మెరిసింది. అయితే ఇంతకు ముందటి నెంబర్ 1 స్థానం పోగొట్టుకుంది. బిట్స్ పలానీ మూడో స్థానంలోకి వచ్చింది. కాలేజీల కేటగిరిలో ఢిల్లీ వర్శిటీకి చెందిన హిందూ కాలేజీ, మిరండా హైస్‌లు మొదటి రెండో స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానాన్ని స్టీఫెన్స్ కాలేజీ దక్కించుకుంది.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చెయ్యాలి..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ
- వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

ఆగస్టు 15 సందర్భంగా జిల్లాలో నిర్వహించు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో వివిధ శాఖల ద్వారా స్టాళ్ల ప్రదర్శన చేపట్టాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలని,దేశ భక్తి గేయాలతో కూడిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు చేయాలని అన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ వీలుగా జూనియర్ కళాశాల మైదానాన్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు.

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు ఆగస్టు 14 లోపు పంపాలని అన్నారు.ముఖ్య అతిథి సందేశం అందించేందుకు వీలుగా స్పీచ్ కాపీ రూపకల్పనకు ప్రతి శాఖ క్లుప్తంగా నివేదికలను డిపిఆర్ఓ కు అందజేయాలని అన్నారు.

స్వాతంత్ర్య వేడుకల వేదిక , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు స్వాతంత్ర్య సమర యోధులను ఆహ్వానించాలని అన్నారు. జిల్లాలో నేత కార్మికులు , ప్రాముఖ్యమైన వ్యక్తులు వేడుకలకు హజరయ్యేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో వేడుకల నిర్వహించి, జిల్లాలో జరిగే వేడుకలకు హజరు కావాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.స్వాతంత్ర్య వేడుకల అవసరమైన మేర త్రాగు నీటి క్యాన్లు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని , ప్రభుత్వ ప్రాదాన్యత అంశాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చవద్దు..

- రాజకీయ కోణంలో చూడకుండా విద్యార్థులకు మంచి చెయ్యండి...
- తల్లిదండ్రులు హాస్టల్స్ ఉంటున్న బిడ్డలపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయద్దు..
- సంక్షేమ హాస్టల్స్ పై భరోసా కల్పించండి..
- బీఆర్ఎస్ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

గత 8 నెలల్లోనే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కొందరు విషాహారం తిని, మరికొందరు పాముకాట్లతో, ఇంకొందరు అనుమానాస్పదంగా మొత్తం 36 మంది విద్యార్థులు చనిపోవటం బాధాకారం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఇటీవల పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాము కాటుకు గురై మృతి చెందిన విద్యార్థి అనిరుధ్ కుటుంబ సభ్యులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ అనిరుధ్ మరణం ఆ తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరిని ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలిసివేసిందని, ఇలాంటి బాధాకరమైన సంఘటనల పై రాజకీయాలు వద్దు అని, ప్రతి ఒక్కరికి కుటుంబాలు ఉన్నాయని, కుటుంబ సభ్యులకు కోల్పోతే ఎంతో బాధ ఉంటుందో అర్థం చేసుకోగలమని అన్నారు. విద్యార్థులు చనిపోవడమే కాదు, సుమారు 500 వందల పిల్లలు విషాహారం తిని హాస్పిటల్ లో జాయిన్ అయ్యే పరిస్థితి వచ్చింది అని అన్నారు.

పిల్లలు బాగుండాలి, వారు ప్రపంచంతో పోటీ పడే విధంగా చదువుకోవాలని, తెలంగాణ విద్యార్థులును ప్రపంచం గర్వపడేలా తీర్చిదిద్దాలని , ఆనాటి కెసిఆర్ ప్రభుత్వంలో వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటు చేసుకు న్నామని,వాటిని ఇంటర్ కాలేజ్ లు, డిగ్రీ కాలేజ్ లు గా కూడా అప్ గ్రేడ్ చేసుకున్నామని అన్నారు. కేజీ టు పీజీ వరకు విద్యను అందించే విధంగా ఆనాడు కెసిఆర్ ప్రభు త్వం గురుకులాల ఏర్పాటుకు రూపకల్పన చేసిందని అన్నారు. చిన్నారులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రులు గురుకులాల్లో చేర్పిస్తున్నారని, గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే తల్లిదండ్రుల మాదిరిగా బాధ్యత తీసుకోవాలని అన్నారు.చనిపోయిన విద్యార్థుల విషయంలో రాజకీయాలు వద్దు అని, చనిపోయిన 36 మంది విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన,రాష్ట్రంలో ఏ తల్లిదండ్రులు కూడా

ఇలాంటి గర్భ శోకం రాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, అలాంటి తల్లిదండ్రులు వారి పిల్లలు చనిపోతే వాళ్ల ఆశలు సమాధి అవుతాయని అన్నారు. విద్యార్థుల విషయాల్లో రాజకీయం చేయాలనుకోవడం లేదు అని, ప్రభుత్వం కూడా బేశాజాలకు పోవద్దని అన్నారు.

గతంలో గురుకులాలను అద్భుతంగా తీర్చిదిద్దిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తరపున ఒక అధ్యయన కమిటీ వేస్తున్నామని, కమిటీ గురు కుల పాఠశాలలను పరిశీలించి, పాఠశాలలో చేపట్టవలసిన చర్యలు గురించి ఐదారు రోజుల్లో నివేదిక ఇస్తారని, ప్రభుత్వానికి సూచనలు చేసే మంచి ఉద్దేశంతోనే ఈ పని చేస్తున్నామని, దీన్ని రాజకీయంగా భావించవద్దు అని అన్నారు.పిల్లలకు పెట్టే ఆహారం విషయంలో ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ముందుగానే, గతంలో బాసర లో ని ట్రిబుల్ ఐటీ విద్యార్థులకు ఫుడ్ విషయంలో బాసర వెళ్లి విద్యార్థులకు భరోసా కల్పించామని అన్నారు. ప కలెక్టర్ల,అధికారులు సంక్షేమ హాస్టల్స్ ను సర్ ప్రైజ్ విజిట్ చేసి ఫుడ్ నాణ్యత ఎలా ఉందో పరిశీలించాలని, నాణ్యతలేని హాస్టల్స్ ఇన్చార్జీలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని గురుకుల, పాఠశాలల ఆవరణలను శుభ్రం చేయించాలని ఈ పిల్లలు మన పిల్లలు అని,ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న ఆరున్నర లక్షల మంది పిల్లలకు ప్రభుత్వమే తల్లిదండ్రులని అన్నారు.ప్రభుత్వం ఈ బాధాకరమైన పరిస్థితిని అర్థం చేసుకోని సంక్షేమ హాస్టల్లపై దృష్టి పెట్టాలని అన్నారు.

## గల్ఫ్ ఏజెంట్ పై కేసు నమోదు

**బలగం టీవీ ,రుద్రంగి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా మానాల గ్రామానికి చెందిన కొలకని రవి అను వ్యక్తిని అడ్డబోర్ తండా కు చెందిన అజ్మీరా కిషన్ అనే వ్యక్తి అజర్ బైజన్ అను దేశం పంపిస్తానని నమ్మించి మోసం చేసి 2,75,000/- రూపాయలు తీసుకుని వీసా ఇవ్వకుండా తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినాడని కేసు నమోదయ్యింది. అజ్మీరా కిషన్ అను వ్యక్తి పైన ఇప్పటికే రుద్రంగి పోలీస్ స్టేషన్ నందు రెండు కేసులు నమోదయ్యాయని రుద్రంగి ఎస్ఐ అశోక్ పేర్కొన్నారు..అజ్మీరా కిషన్ పై వివిధ పోలీసు స్టేషన్ లలో కేసులు నమోదై అరెస్టు అయ్యి ,జైల్లో ఉన్నాడని ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీసు స్టేషను లో సంప్రదించాలని తెలిపారు...

## నేటి నుండి న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు...

**బలగం టీవీ, సిరిసిల్ల**

కోర్టు ఉత్తర్వులలో రాజన్న సిరిసిల్ల పోలీసుల జోక్యాన్ని నిరసిస్తూ నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా దోర్నాల సంజీవరెడ్డి మాట్లాడుతు కోర్టు ఇచ్చిన ఇంజెక్షన్ ఆర్డర్ లను పట్టించుకోకుండా కక్షిదారుల, న్యాయ వాదుల పై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. న్యాయవాదులు గత 12 రోజుల నుండి కోర్టు విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్నప్పటికి తమ వైఖరిని మార్చుకోకుండ కక్షదారుల పై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన పోలీసులు వైఖరిని మార్చుకొని కోర్టు ఉత్తర్వులు కి విలువ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల వాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసే సదానంద, జనరల్ సెక్రెటరీలు తంగళపల్లి వెంకట, రజనికాంతి, కార్య దర్శులు నాగరాజ్ గౌడ్, విష్ణు, వాం శశాకం , పుష్పలత , సీనియర్ న్యాయవాదు లు, ఉమాశంకర్ , మోహన్ కుమార్, వసంతం ధర్మేందర్ , కోడం సత్యనారాయణ, కోడం సురేష్,ర మాకాంతరావు, కోడీలక్ష్మణ్, నాగుల సత్యనారాయణ, గోవింద్, భాస్కర్ రవీందర్ రావు, అంజయ్య,అనిల్ కుమార్, మారుతి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్‌ను నిర్మూలించి

# భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దాం..




- డ్రగ్స్, గంజాయి నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి..
- అదనపు ఎస్పీ చంద్రయ్య.

**బలగం టీవీ , సిరిసిల్ల :**

డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దాం అని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. నాశ్ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాలపై అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా అదనపు ఎస్పీ చంద్రయ్య హాజరై, మాట్లాడుతూ యవత ,విద్యార్థులు మత్తు పదార్థాలకు,గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తు లో ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు.విద్యార్థులు,యువత మత్తు పదార్థాలకు మానసికగా బానిస కావడం ద్వారా అనుకోకుండా నేరాలు చేసే అవకాశం ఉందని,కావున డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో ఉన్నత లక్ష్యాల ను సాదంచాలన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయికి సంబంధించిన సమాచారం డయల్ -100,టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ 87126 56392 ,లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, ఎస్ఐ అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



## గల్ఫ్ బాధితుడికి అండగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

- స్వదేశం పంపాలని బహ్రాయిన్ ఎంబసీ కి లేఖ..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ ఒంటరి బతుకులకు బాసటగా నిలుస్తు, గల్ఫ్ వెళ్ళి అక్కడ ఇబ్బందులు పడుతున్న బాధితుల కోసం అండగా ఉంటానని , భరోసా ఇస్తూ వారు స్వదేశం రావడానికి ప్రభుత్వం పరంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.మరోసారి గల్ఫ్ బాధితుడికి అండగా నిలిచారు. పాస్ పోర్ట్,వీసా లేక బహ్రాయిన్ జైల్లో మగ్గుతున్న గల్ఫ్ బాధితున్ని క్షేమంగా స్వదేశానికి పంపేలా బహ్రాయిన్ ఎంబసీ లేక రాశారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మానువాడ నర్సయ్య 28 ఏండ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం బహ్రాయిన్ కు వెళ్లి మూడేండ్ల పాటు తాపీ మేస్త్రీ గా పనిచేసి వర్క్ పర్మిట్ ముగియడంతో అక్కడే ఉండిపోయాడు. దాంతో పాస్‌పోర్ట్,వీసా లేనందున బహ్రాయిన్ లో జైలు జీవితం అనుభవిస్తున్నాడు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించి మానువాడ నర్సయ్య తిరిగి స్వదేశానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ, బహ్రెయిన్ దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడారు. మానువాడ నర్సయ్యను ఇండియా కు తీసుకువచ్చేందుకు అండగా ఉంటానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# విద్యుద్ఘాతంతో రైతు మృతి

**బలగం టీవీ , భూత్పూర్**

విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన రైతు మేకల లక్ష్మయ్య(62) ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద కరెంటు మోటారును ఆన్ చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ప్రమాదవశాత్తు బోరుమోటారు వద్ద విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెంది కనిపించాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని చిన్నకుమారుడు మేకల శివరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

# హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- డివైడర్‌ను ఢీ కొన్న బైక్
- ముగ్గురు యువకులు మృతి

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఈ సంఘటన హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ శంకేశ్వర్ బజార్‌కు చెందిన బ్యాగరి శ్రీహరి (28), సందీప్ (20) , అభిలాష్ (20) స్నేహితులు. ముగ్గురు స్నేహితులు సోమవారం సైదాబాద్‌లో బోనాల పండుగ కావడంతో ఎంజాయ్ చేయడానికి పల్సర్ బైక్‌పై బయటికి వెళ్లారు. ఈ క్రమంలోనే అభిలాష్ సోదరి ఫోన్ చేసి మైలార్‌దేవ్ పల్లిలో ని తన ఇంటికి రావాలని చెప్పింది. దీంతో అభిలాష్‌ను మైలార్‌దేవ్ పల్లిలో ఉండే అతడి సోదరి ఇంటికి ముగ్గురు బైక్‌పై వస్తున్నారు. చాంద్రాయణగుట్ట మీదుగా మైలార్‌దేవ్‌పల్లికి వస్తుండగా హాషమాబాద్ వద్ద స్పీడ్‌గా ఉన్న బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీహరి, సందీప్, అభిలాష్‌లు ముగ్గురు బైక్‌పై నుంచి 20మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. ముగ్గురి తలలకు తీవ్ర గాయాలు కాగా సందీప్, అభిలాష్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ

**బలగం టీవీ , హైదరాబాద్**

గత ప్రభుత్వ హయాంలోని అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను రిలీజ్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఇరిగేషన్ ఏఈ.. ఏసీబీకి చిక్కాడు. సోమవారం హనుమకొండలోని నక్కలగుట్ట ఎస్‌బిఐ ప్రాంతంలో రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పాలకుర్తి మండలం, గుడికుంట తండా మాజీ ఎంపీటీసీ బానోతు యాకు గతంలో చేసిన పనుల కోసం ఇరిగేషన్ ఏఈ గోపాల్ రూ.పది వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పక్కా ప్లాన్ ప్రకారం రూ.6 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏఈ గోపాల్ ప్రస్తుతం గుడికుంట తండా పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

# స్కూల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..?

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. సోమవారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులు, వంట గది, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల తీరును, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలోని ప్రశ్నలను సంధించి, సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని ప్రశ్నించారు,ఏ తరగతిలో ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దానికి అనుగుణంగా కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి, జీవితంలో ఉన్నతమైన




స్థానాలను అధిరోహించాలని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, తదితరులు ఉన్నారు.

# భార్యను కాపురానికి పంపడం లేదని అత్త, మామలపై అల్లుడు దాడి

- మామ మృతి, అత్త పరిస్థితి విషమం
- ములుగు జిల్లాలో ఘటన

**బలగం టీవీ , మంగపేట**

భార్యను కాపురానికి పంపడం లేదని అత్త, మామలపై అల్లుడు కర్రతో దాడి చేశాడు. ఈ సంఘటనలో మామ మృతి చెందగా అత్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద ఘటన ములుగు జిల్లా, మంగపేట మండలం, బాలన్న గూడెం పంచాయతీ పరిధి నీలాద్రిపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నీలాద్రిపేటకు చెందిన దంపతులు గొర్రె రాజ నర్సయ్య (56) నర్సమ్మకు ముగ్గురు కుమార్తెలు. రెండవ కూతురు స్వప్నను అదే గ్రామానికి చెందిన గాంధర్ల రామకృష్ణకు ఇచ్చి 17 ఏండ్ల క్రితం వివాహం చేశారు. గాంధర్ల రామకృష్ణ నాలుగేండ్ల



క్రితం నుంచి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటూ స్వప్న భర్తను అనుమానించి తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం స్వప్న కిరాణా షాపుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రామకృష్ణ తనతో ఎందుకు మాట్లాడటం లేదని మందలించగా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె వెనకాలే వెళ్లిన భర్తను చూసి అత్త, మామలు రామకృష్ణను మందలించడంతో.. మీ వల్లనే తన భార్య కాపురానికి రావడం లేదు అంటూ రామకృష్ణ కోపంతో అక్కడే ఉన్న కర్రతో మామపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అత్త నర్సమ్మ వారించే క్రమంలో ఆమెను కూడా చంపుతానంటూ దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించే క్రమంలో రాజనర్సయ్య మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏటూరు నాగారం ఎఎస్పి శివమ్ ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు నర్సమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం నర్సమ్మను కూడా వరంగల్ కు తరలించామని తెలిపారు. మృతుడి చిన్న కూతురు సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



## ఫొగాట్ అభ్యర్థనపై తీర్పు వాయిదా

**బలగం టీవీ, పారిస్**

భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అప్పీల్‌పై నిర్ణయాన్ని ఈనెల 13న మంగళవారం(నేడు) ప్రకటించనున్నట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్టట్స్ (సిఎఎస్) ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వినేశ్ అభ్యర్థనపై చర్చించేందుకు మరింత సమయం పడుతుందని, క్షుణ్ణంగా చర్చించి 13న తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు సిఎఎస్ పేర్కొంది. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా వినేశ్‌ను ఫైనల్‌కు సస్పెన్షన్ వేసిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం తీర్పు వెలువడుతుందని భార త ఒలింపిక్ సంఘం తెలిపింది. మొదట శనివారం సాయంత్రం తీర్పు వెల్లడిస్తామని ప్రకటించిన సిఎఎస్ చివరి క్షణం లో వాయిదా వేసింది.

## దేశవాళీ క్రికెట్ ఆడనున్న రోహిత్, కోహ్లీ!

**బలగం టీవి, ముంబయి**

భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ దులిప్ ట్రోఫీలో భారత స్టార్ ఆటగాళ్లంతా బరిలోకి దిగనున్నారు. బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు భారత్ ఆటగాళ్లందరికి మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలనే ఉద్దేశంతో టీమిండియా మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టెస్ట్ ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 5 జోన్ల నుంచి 5 జట్లు పాల్గొంటాయి. సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ జోన్స్ ఆడుతాయి.

భారత ఆటగాళ్లంతా తమ దేశవాళీ టీమ్స్ ప్రకారం ఆయా జోన్లలో బరిలోకి దిగుతారు. సెప్టెంబర్ 5 నుంచి 24వ తేదీ వరకు ఈ టోర్నీ జరగనుంది. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్ట్ చెన్నై వేదికగా 19వ తేదీన ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ముందు వరకు భారత స్టార్ ఆటగాళ్లంతా దులిప్ ట్రోఫీ ఆడనున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనప్పుడు సీనియర్ ఆటగాళ్లు కూడా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐతో పాటు సెలెక్షన్ కమిటీ సూచించిన విషయం తెలిసిందే. తమ ఆదేశాలను బేఖాతరు చేసిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపై క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకుంది.

మరోవైపు నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం.. సీనియర్ ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలని సూచిస్తున్నాడు. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ తదితరులు దులిప్ ట్రోఫీ ఆడనున్నట్లు తెలుస్తోంది.

## కన్నప్ప' నుంచి మరో పాత్ర రివీల్




**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఈ మూవీని డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఓ పాత్రను విడుదల చేసింది కన్నప్ప టీం. ఈ సినిమాలో నటుడు సంపత్ రామ్ భిల్లు జాతి దొర చండుడు అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. అడవినే భయభ్రాంతుల్ని చేసే భీకర జాతి. నల్ల కనుమ నేలలో పుట్టారు. మొసళ్ళ మడుగు నీరు తాగి పెరిగారు. భిల్ల జాతి అధినేత చండుడు. రాతి గొడ్డళ్లే వీరి ఆయుధం. శత్రువుల రక్తంతోనే అభిషేకం అంటూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

# ముగిసిన విశ్వ క్రీడలు

- 40 బంగారు పతకాలతో టాప్‌లో అమెరికా
- భారత్‌కు ఆరు పతకాలు, నెరవేరని 'డబుల్' కల



**బలగం టీవి, పారిస్**

**ఫ్రాన్స్ దేశ రాజధాని పారిస్ వేదికగా 17 రోజుల పాటు సాగిన ప్రపంచ క్రీడా సంబరాలు ముగిశాయి. పారిస్‌లో జూన్ 26న ప్రారంభమైన ఒలింపిక్స్ క్రీడలు.. ఆగస్టు 11న (ఆదివారం) సమాప్తమ య్యాయి. పారిస్‌లోని సెన్ నది ఒడ్డున అట్టహాసంగా ప్రారంభమైన ఒలింపిక్స్ పోటీలు.. స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో అంతే అట్టహాసంగా నిర్వహించిన వేడుకల మధ్య ముగిశాయి. ఒలింపిక్స్ ముగింపు ఉత్సవాలు అంబరాన్నంటాయి. ప్రఖ్యాత నృత్యకారులు, సంగీత కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. అన్ని దేశాల క్రీడాకారులు, పతక విజేతలు పాల్గొని సందడి చేశారు. భారతీయ క్రీడాకారులు షూటర్ మను బాకర్, హాకీ దిగ్గజం పీఆర్ శ్రీజేష్ కవాతులో పాల్గొన్నారు.**

ఇక పతకాల పట్టికలో అగ్రస్థానం కోసం ఎప్పటిలాగే అమెరికా, చైనా 'టాప్' లేపగా పలు దేశాలు బోణీ కూడా కొట్టకుండానే రిక్తహస్తాలతో వెనుదిరిగాయి. 117 మంది భారీ బృందంతో పారిస్‌కు వెళ్లిన భారత్ ఈసారి 'రెండంకెల పతకాల' కలను నెరవేర్చుకోకుండానే స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది. ఇక ఒలింపిక్స్‌లో తర్వాతి గమ్యస్థానం లాస్ ఏంజెల్స్. 2028లో ఈ నగరం విశ్వక్రీడలకు ఆతిథ్యమివ్వనుంది.

ఎన్నో సంచలనాలు, మరెన్నో అబ్బురపరిచే ప్రదర్శనలు, కొత్తగా నమోదైన రికార్డులు, త్రుటిలో చేజారిన పతకాలు, క్రీడాకారుల నాలుగేండ్ల కఠోర శ్రమకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన పారిస్.. ఆటలకు ఘనంగా వీడ్కోలు పలికింది. ఐరాస గుర్తించిన దేశాలన్నింటితో పాటు ఒలింపిక్ శరణార్థుల జట్టు (ఐవోసీ) నుంచి పాల్గొన్న 10,500 మంది క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రదర్శనలతో అభిమానులకు అసలైన మజాను అందించారు. ఆతిథ్య పారిస్‌లోని 'ఒలింపిక్ గ్రామం'లో వసతుల లేమి, సీన్ నదిలో ఆరంభ వేడుకలు, అక్కడి నీటి నాణ్యతపై అపోహలు, పోటీల ఆరంభానికి ముందే అల్లరి మూకల బెదిరింపు చేష్టలు, బరిలో నిలిచిన పలువురు అథ్లెట్ల 'జెండర్'పై వివాదం, భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు వంటి చర్చోప చర్చలకు ఒలింపిక్స్ కేంద్ర బింధువైంది.

పారిస్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత్ మరోసారి ఆరు పతకాలతో సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. అయితే ఆశించిన మెడల్స్ రాకున్నా మన క్రీడాకారుల ఆట మునపటి కంటే బాగా మెరుగు పడింది. షూటింగ్‌లో యువ సంచలనం మను భాకర్ ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు కొల్లగొట్టి చరిత్రాత్మక ప్రదర్శన చేసింది. సరబ్‌జ్యోత్ సింగ్, స్వప్నిల్ కుశాలె, అర్జున్ బబుతా వంటి యువ షూటర్లు భవిష్యత్‌పై ఆశలు రేపుతున్నారు. పతకాలు రాకున్నా ఆర్చరీలో మన విలుకాళ్లు గతం కంటే మెరుగైన ప్రదర్శనే కనబరిచారు. బ్యాడ్మింటన్, ఆర్చరీ, షూటింగ్, అథ్లెటిక్స్ వంటి పలు క్రీడాంశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచి మరో ఏడు పతకాలు సాధించే అవకాశాన్ని కోల్పోయింది.

టేబుల్ టెన్నిస్‌లో ప్యాడ్లర్లు మనికా బాత్ర, హైదరాబాదీ అమ్మాయి ఆకుల శ్రీజ సైతం ఫర్వాలేదనిపించారు. ఇక నీరజ్ మరో స్వర్ణం తేకున్నా రజతంతో రికార్డులు సృష్టించాడు. హాకీలో వరుసగా రెండోసారి కాంస్యం గెలుచుకున్న భారత జట్టు ఒలింపిక్స్‌లో 52 ఏండ్ల తర్వాత ఆస్ట్రేలియాను ఓడించడం విశేషం. బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో మాత్రం దేశానికి నిరాశజనక ప్రదర్శనలు వచ్చాయి. రెజ్లింగ్‌లో వినేశ్ ఫొగాట్ 'వంద గ్రాముల' బరువు దేశ క్రీడాభిమానులకు కలిచివేయగా యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ మాత్రం 'పట్టు' వీడలేదు.

ఇక అమెరికా, చైనా దేశాలూ అగ్రస్థానం కోసం చెమటోడ్చాయి. తలా 40 స్వర్ణాలతో సత్తా చాటినా మొత్తంగా అమెరికాకు 126 పతకాలు రాగా చైనా 91 పతకాల వద్దే ఆగిపోయింది. టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, డైవింగ్, షూటింగ్ వంటి క్రీడాంశాల్లో చైనా దూకుడు చూపించగా అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్‌లో అమెరికా ఆధిక్యంలో నిలిచింది. ఆతిథ్య ఫ్రాన్స్ 53 పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది. ఆరు పతకాలు వచ్చినా స్వర్ణం లేకపోవడంతో భారత్ 71వ స్థానంతో ముగించింది.



# పూరి ఒక గన్ లాంటోడు

- హీరో రామ్ పోతినేని
- అట్టహాసంగా డబుల్ ఇస్మార్ట్ ప్రీ రిలీజ్ వేడుక




**బలగం టీవి, వరంగల్**

టాలీవుడ్ స్టార్ హీరో రామ్ పోతినేని– పూరి జగన్నాథ్ కాంబోలో తెరకెక్కిన హై వోల్టేజ్ సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం వరంగల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో రామ్ డైరెక్టర్ పూరిని గన్? (తుపాకి)తో పోల్చారు. గన్ ఎంత బాగా పేలిస్తే హీరో బుల్లెట్‌లా దూసుకుపోతారని రామ్ అన్నారు. .

'టాలీవుడ్‌కు స్ఫూర్తినిచ్చే దర్శకుడు పూరి జగన్నాథ్. దర్శకుడు, రచయిత కావాలనున్న చాలామంది ఆయన్ను చూసే ఇండస్ట్రీలోకి వచ్చి ఉంటారు. నా ఫోన్‌లో ఆయన కాంటాక్ట్ గన్ అని సేవ్ చేసుకున్నా. హీరోలు బుల్లెట్ లాంటోళ్లు. గన్ పేలిస్తేనే బుల్లెట్ వెళ్తుంది. అలాంటి గన్ పూరి జగన్నాథ్. ఆయన చాలా మంది హీరోలకు అవసరం. ఆయనతో కలిసి పని చేస్తే వచ్చే కిక్ ఎక్కడా రాదు.

మనలో చాలామంది తమ సొంత అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం లేదు. మనం ఓ రెస్టారెంట్‌లో తిన్న బిర్యానీ బాగుంటే మిగిలిన వారు బాగోలేదంటే మనపై మనకు డౌట్ ఉండకూడదు. నేను తిన్నాను బాగుందనుకోవాలి. పక్కవారి ఒపీనియన్ వల్ల నీ ఒపీనియన్ మార్చుకోవద్దు. అది బిర్యానీ అయినా, సినిమా అయినా, మీ కెరీర్ అయినా మీకు నచ్చింది చెయ్యండి. ఎందుకంటే పక్కోళ్ల గురించి, పకోడీల గురించి పట్టిం చుకుంటే పనులు జరగవు. మీరంతా నా వాళ్లు అనుకుని ఇదంతా చెబుతున్నా' అని రామ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ పూరి జగన్నాథ్ మాట్లాడుతూ తాను దర్శకత్వం వహించిన ఓ సినిమా ఫ్లాప్ అవ్వగా రచయిత విజయేంద్ర ప్రసాద్ ఫోన్ చేసి మాట్లాడిన సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'హిట్ సినిమా తీస్తే చాలామంది ఫోన్ చేసి ప్రశంసిస్తారు. ఫ్లాప్ సినిమా విషయంలోనూ నాకు ఓ కాల్ వచ్చింది. సినిమా ఫ్లాఫ్ అయిన వారం తర్వాత విజయేంద్ర ప్రసాద్ నాకు ఫోన్ చేశారు. 'నాకో సాయం చేస్తారా?' అని అడిగారు. 'ఆయన కొడుకు రాజమౌళే పెద్ద డైరెక్టర్. నేనేం హెల్ప్ చేయాలి?' అని మనసులో అనుకున్నా. 'తదుపరి చిత్రం ఎప్పుడు చేస్తున్నారు? మీరెప్పుడు చేసినా ఆ సినిమా కథ నాకు చెబుతారా?' అని అడిగారు. ఆయనెం దుకు అలా అంటున్నారో కొంచెం అర్థమైంది. 'మీలాంటి డైరెక్టర్లు ఫెయిల్ అవ్వడం నేను చూడలేను. చిన్న చిన్న తప్పులు చేస్తుంటారు. అందుకే తీసే ముందు నాకు ఒక్కసారి చెప్పండి' అని అన్నారు. ఆయన మాటలతో భావోద్వేగానికి గురయ్యా. నాపై అభిమానంతో చేసిన ఆ కాల్‌ని ఎప్పటికీ మర్చిపోలేను. అయితే, ఈ స్టోరీ గురించి ఆయనకు చెప్పలేదు.ఒళ్లు దగ్గర పెట్టుకుని సినిమా చేశా' అని అన్నారు. తనపై ప్రేమ, అభిమానంతోనే విజయేంద్ర ప్రసాద్ ఆ ఫోన్ చేశారని పూరి తెలిపారు.